



**మనభారతం** **డా.వల్లూరుపల్లి శివాజీరావు**

## 129
## మహాత్మా గాంధి-36



*క్రిందటి సంచికలో వివరించినట్లు ఆంగ్ల ప్రభుత్వం శాసన మండలిలో ప్రవేశపెట్టిన రౌలట్ బిల్లు 1919 మార్చి 10 వ తేదీన చట్టంగా రూపొందింది. ఈ చట్టం ప్రభుత్వానికి విద్రోహ కార్యకలాపాలు నిర్వహించే ఏ వ్యక్తిని అయినా విచారణ లేకుండా అరెస్ట్ చేసి, జైలులో పెట్టి, అవసరమయితే అతనిని మట్టుపెట్టే అధికారం ఇచ్చింది. ఈ పరిణామం దేశం అంతటా అశాంతికి దారి తీసింది. ప్రభుత్వ వ్యతిరేక చర్యలకు ప్రజలలో అపూర్వ స్పందన మొదలయింది. తద్వారా దేశం నలుమూలలా జరిగిన అశాంతి మంటలు, సత్యాగ్రహాలు, గాంధీజీ నిర్వహించిన కార్యక్రమాలు క్రిందటి నెల వ్యా సంలో తెలుసుకున్నాము.*

*ఈ సంచికలో అమృతసర్ లోని జలియన్ వాలా బాగ్ లో జరిగిన నరమేధం (massacre) గురించి, తద్పులి తంగా ఎంతమంది భారతీయులు అసువులు బాశారో, తదితర విషయాలు తెలుసుకుందాము.*

### జలియన్ వాలా బాగ్ నరమేధం

ఒక వైపు రౌలట్ చట్టంకు వ్యతిరేకంగా అహింసామార్గంలో శాంతియుతంగా సత్యాగ్రహం నిర్వహించ మని గాంధీజీ, ఇతర నాయకుల సూచనలను ప్రజలు అనుసరిస్తుంటే, మరొక వైపు ఆంగ్లేయ ప్రభుత్వం చట్టవిరుద్ధమైన అణచివేత చర్యలు దేశం అంతటా చేపట్టింది. ఫలితంగా అనేక చోట్ల చాలామంది ప్రాణాలు పోగొట్టుకోవటం మొదలయింది. ఈ సమయంలో మన విశాల భారతావనిలో అతి దారుణమై న నరమేధం పంజాబ్ లోని అమృతసర్ లో జరిగింది. ప్రభుత్వం Martial Law ప్రకటించి వెంటనే ప్రత్యేక న్యాయస్థానాలు ఏర్పాటు చేసి, న్యాయ ఉల్లంఘన చేసి,

సాక్ష్యాలు లేకపోయినా నిరంకుశ దోరణిలో ఏక పక్ష నిర్ణయాలను తీసుకుని అసమంజసమైన శిక్షలు వేసి లక్షలాది నాయకులను కారాగారాలలో బంధిం చింది.

ఏప్రిల్ 7 వ తేదీన గాంధీజీ '*సత్యాగ్రహి*' అనే పేరుతో ఒక వ్యాసం ఒక పేరున్న పత్రికలో ప్రచురిం చారు. దానిని చూసి ఆంగ్లేయ అధికారులు సత్యాగ్రహం నిర్వహించే మహాత్మా మీద, ఇతర నాయకుల మీద తీసుకోవలసిన చర్యల గురించి తమలో తాము చర్చించుకున్నారు. ఆయనను పంజాబ్ వెళ్ళకుం డా నిషేదించటం, ఒక వేళ ప్రభుత్వ ఆదేశాలను అతిక్రమిస్తే, ఆయనను అరెస్ట్ చేసి జైలులో పెట్టటం.

పంజాబ్ లో పరిస్థితి అతి వేగంగా క్షీణిస్తోంది. రైలు, టెలిగ్రాఫ్, కమ్యూనికేషన్ వ్యవస్థలు పూర్తిగా క్షీణించాయి. ఏప్రిల్ మొదటి వారంలో లాహోర్ లో (అమృతసర్ కు 34 మైళ్ళు దూరం) ప్రజలందరు రోడ్ల మీదకు వచ్చి రహదారులను అడ్డ గించారు. 20,000 పైచిలుకు ప్రజలు Anarkali Bazaar లో గుమిగూడి సత్యాగ్రహం, అల్లరులు చేయటం మొదలయింది.

పంజాబీల తిరుగుబాటు చాలా తీవ్రంగా ఉంటుందని సైన్యాధికారులలో చాలామంది నమ్మి తీవ్ర పరిణామాలకు సిద్ధమయ్యారు. 1857 లో జరిగిన ప్రజాతిరుగుబాటు పోలిన ప్రజా సమన్వయ ప్రజా తిరుగుబాటు పోలిన తిరుగుబాటు ప్రస్తుతం ఈ రాష్ట్రంలో మే (May) నెలలో జరుగవచ్చని పంజాబ్ లెఫ్టినెంట్ గవర్నర్ Michael O'Dwyer నమ్మటం జరిగింది.

**పంజాబ్ ప్రముఖ నాయకుల అరెస్టు, బహిష్కరణ**

ముందు చర్యగా O'Dwyer గాంధీజీని బర్మాకు బహిష్కరించాలని సూచించగా ఇతర అధికారులు ఇది జరిగితే ప్రభుత్వం ప్రజలనుంచి మరింత తీవ్ర పరిణామాలను ఎదుర్కోవలసి వస్తుందని ఈ పంజాబ్ అధికారికి తెలియజేశారు. పంజాబ్ లోని ప్రముఖ నాయకులు Dr. Satya Pal, Dr. Saifuddin Kitchlew హిందూ-ముస్లిం ఐక్యతకు నిదర్శనం. వీరిద్దరు గాంధీజీ ప్రారంభించిన సత్యాగ్రహ ఉద్యమానికి పూర్తి మద్దతుతెలిపిన ముఖ్య నాయకులు. ఏప్రిల్ 9 వ తేదీన వీరిద్దరూ ప్రజలతో కలిసి శ్రీ రామ నవమి పండుగ ఉత్సవంలో అత్యంత ఉత్సాహంగా పాల్గొంటున్నారు. దీనిని గమనించి ఈ ఇద్దరినీ అరెస్ట్ చేయమని డెప్యూటీ కమీషనర్ Miles Irving ను అరెస్ట్ చేయమని O'Dwyer ఆదేశించాడు.

వెంటనే Miles Irving ఆ ఇద్దరు నాయకులను బంధించి ఒక రహస్య ప్రదేశానికి తరలించా డు. అదే రోజున ఒక సైనిక బృందం ప్రజా సమూహం మీద కాల్పులు కాల్చగా 20 మంది నిరసనకారులు ప్రాణాలు కోల్పోవటం

జరిగింది. దీనితో ఉద్యమకారులు ఉవ్వెత్తున చెలరేగి సైనికుల మీద, ఆంగ్లేయుల మీద దహన కాండ ప్రారంభించారు. ఫలితంగా కొందరు సైనికులు, ఆంగ్ల ప్రజలు మరణించారు. వీరిలో ఇద్దరు ఆంగ్లేయ స్త్రీలు కూడా ఉన్నారు.

**మిషినరీ పాఠశాల నడిపే ఆంగ్ల వనిత మీద దాడి; దానికి పోలీసుల ప్రతీకార చర్య**

అమృతసర్ లో ఒక వృద్ధ ఆంగ్ల వనిత Marcella Sherwood ఒక మిషనరీ పాఠశాల నడుపుతూ ఉంది. అందులో 600 మంది భారతీయ పిల్లలు ఉన్నారు. ప్రసుత పాఠశాల ఉన్న భవనం నుంచి వేరొక వీరిని ఒక సురక్షిత ప్రదేశానికి చేర్చాలని సంకల్పించి ఏప్రిల్ 11వ తేదీన ఆమె ఒంటరిగా Kucha Kurrichhan వీధిలో నడుస్తున్నప్పుడు కొంతమంది నిరసనకారులు ఆమెపై తీవ్రంగా దాడి చేశారు. అది చూసి కొంత మంది స్థానిక భారతీయులు ఆమెను రక్షించి Gobindgarh కోటలో ఒక సురక్షిత ప్రదేశంలో దాశారు.

ఈ సంగతి అమృతసర్ ఆర్మీ కమాండర్ కల్నల్ Reginald Dyer విని తన సైనికులకు ఒక ఆజ్ఞ జారీచేశాడు. అది "ఆ వీధిలో ప్రతి భారతీయుడు వాడి పొట్టను భూమికి తాకుతూ చేతులు, మోకాళ్లపై పాకుతూ వెళ్ళేటట్లు చేయాలి (***దీనిని మొదటి చిత్రంలో చూడవచ్చు***). ఈ భారతీయులకు ఒక హిందూ దేవత ఎంత పవిత్రమో మనకు ఒక ఆంగ్ల స్త్రీ అంతే పవిత్రమని వారికి తెలిసిరావాలి." ఈ అత్యంత హేయమైన చర్యతో పాటు స్థానికులపై విచక్షణారహితంగా, బహిరంగంగా లాఠీలతో కొట్టమని స్థానిక పోలీసు అధికారులను ఆదేశించాడు.

ఆ రోజు, మరుసటి రోజు (ఏప్రిల్ 12). అమృతసర్ నగరం ప్రశాంతంగా ఉన్నా, పంజాబ్ లోని ఇతర ప్రదేశాలలో హింస కొనసాగింది. రైలు పట్టాలు తొలగించబడ్డాయి; టెలిగ్రాఫ్ స్తంభాలు ధ్వంసం చేయబడ్డాయి; ప్రభుత్వ భవనాలను తగలబెట్టబడ్డాయి; ముగ్గురు యూరోపియనులు హత్యచేయబడ్డారు.

ఏప్రిల్ 13 వ తేదీ ఆదివారం; హిందువులు, మహ్మదీయులు బైశాఖి (వైశాఖి) పండుగ సంతోషం గా జరుపుకునే రోజు. ఆ కారణంతో పంజాబీ ప్రజలు రాష్ట్రం అంతా అల్లర్లు చేపట్టవచ్చని ప్రభుత్వం ఉహించి Martial Law ప్రకటించింది. పౌర హక్కులు, నలుగురి కంటే ఎక్కువ మంది సమావేశమవ్వటం నిషేదించబడ్డాయి. కాని సత్యపాల్, Saifuddin Kitchlew లను ప్రభుత్వం అరెస్ట్ చేసి, బహిష్కరణ చేసి నందుకు ప్రజలు రాష్ట్రమంతటా శాంతియుతంగా నిరసన చేపట్టారు.

**అమృతసర్ లో నర మేధం**

12 వ తేదీ సాయంత్రం కొంతమంది అమృతసర్ హిందూ కళాశాల మైదానంలో ఒక సమావేశం జరిగింది. ముఖ్య నాయకులు సత్యపాల్, Kitchlew అరెస్ట్, బహిష్కరణకు వ్యతిరేకంగా మరుసటి రోజు (ఏ
ప్రిల్ 13) సాయంకాలం 4.30 గంటలకు బహిరంగ నిరసన సభను నిర్వహించి, రౌలట్ చట్టం యెడల
తమ వ్యతిరేకతను, ఈమధ్య ఆంగ్లేయ అధికారులు తీసుకున్న ప్రజావ్యతిరేక చర్యలు, సత్యపాల్, Kitch lew లను అరెస్ట్ చేసి, రాష్ట్ర బహిష్కరణ చేయటం, తదితర విషయాలగురించి తమ వ్యతిరేకతను ప్రభుత్వానికి తెలియజేయటానికి ఆమోదించటం జరిగింది.

**మరుసటి రోజు ఏప్రిల్ 13 వ తేదీ.** ఆరోజున ఉదయం 9 గంటలకు అమృతసర్ పట్టణం మిలిటరీ కమాండర్ కల్నల్ Dyer ఆ పట్టణ అధికారులతో సమావేశమయ్యారు. ఆ రోజు బైసాఖి పండుగ కాబట్టి ఆ రోజు రాత్రి 8 గంటలకు ఆ పట్టణం, దాని పరిసరాలలో కర్ఫ్యూ విధిస్తున్నానని, అందువల్ల అన్ని ఊరే గింపులు, బహిరంగ సభలు నిషేదిస్తున్నానని, ఎక్కడా నలుగురి కంటే ఎక్కువమంది గుమిగూడ కూడ దని; కర్ఫ్యూని అతిక్రమించిన వారిమీద కఠిన చర్యలు తీసుకోవాలని వారికి తెలియజేసారు. ఈ విష యం అచ్చటి ప్రజలకు తెలిసేటట్లు హిందీ, ఇంగ్లిష్, పంజాబీ, ఉర్దూ భాషలలో ఆయన ప్రకటించాడు.

ఈ సమావేశం జరుగుతున్నప్పుడు స్థానిక పోలీసు అధికారికి ఒక సమాచారం అందింది. అది: ఆ రోజు మధ్యాహ్నం అమృతసర్ వాసులు అత్యధిక సంఖ్యలో జలియన్ వాలా తోటలో (బాగ్ లో) సమా వేశం అవ్వాలని నిర్ణయించారు. కర్ఫ్యూ విషయం తెలియక చుట్ట ప్రక్కల గ్రామాల ప్రజలు అమృతసర్ వచ్చి ఈ తోటలోకి రావటం జరిగింది. ఈ సమావేశం సంగతి Dyer కు 12.40 గంటలకు తెలిసింది. ఈ ప్రజా సమావేశాన్ని ఎలా అడ్డుకోవాలీ అనే విషయం ఇతర అధికారులతో చర్చించటం జరిగింది.

మధ్యాహ్నం 12 గంటలకు వేలాది భారతీయులు జలియన్ వాలా తోటలో గుమిగూడారు. వీరిలో కొంతమంది సిక్కులు Golden Temple నుంచి ఇళ్లకు వెళ్తూ మధ్యలో ఈ తోటను చూసి అందులోకి ప్రవే శించారు. ఈ తోట విస్తీర్ణం 6 లేక 7 ఎకరాలు; పరిమాణం 200x200 గజాలు. దీనికి 4 వైపులా 10 అడు గుల ఎత్తు గోడ వుంది. ఈ గోడల బయట చుట్టూ 4, 5 అంతస్థుల ఇళ్ళు ఉన్నాయి. ఈ తోటలో ప్రవేశించ టానికి ఐదు ఇరుకైన గేట్లు ఉన్నాయి. వర్షా కాలంలో ఇందులో రైతులు పంటలు పండిస్తారు. ఇతర సమయం లో ఇది స్థానికులకు సమావేశాలు, ఆట పాటలకు నిలయం. ఈ తోట మధ్యలో ఒక సమాధి

ఉంది; నీటితో నిండిన 20 అడుగుల వైశాల్యం ఉన్న నుయ్యి కూడా ఉంది. ఆ రోజు పండగ రోజు కాబట్టి యాత్రికులతో పాటు చుట్టుప్రక్కల గ్రామాలనుంచి అమృతసర్ వచ్చిన రైతులు, వర్తకులు, వ్యాపారస్థుల లో చాలా మంది ఈ తోటలో ప్రవేశించారు. పట్టణ పోలీసులు మధ్యాహ్నం 2 గంటలు సమయంలో జాత ర ముగించినట్లు ప్రకటించారు. అది విని ఇంకా చాలా మంది ఈ జలియన్ వాలా తోటలోకి వెళ్లారు.

**Dyer ఆజ్ఞతో తోటలో ప్రవేశించిన భారతీయులమీద సైనికుల కాల్పులు**

ఇది జరుగుతున్నప్పుడు కమాండర్ Dyer ఒక విమానం ఏర్పాటు చేసి దానితో ఈ తోటలో ఎంత మంది ఉన్నారు అనేది అంచనా వేయించాడు. దానిని బట్టి 6,000 మంది పైచిలుకు ఉన్నట్లు తెలిసింది. కాని Dyer వచ్చేటప్పటికి 10,000-20,000 మధ్య ఆ తోటలో సమావేశం అయ్యారని Hunter కమిషన్ అంచనా వేసింది. కల్నల్ Dyer, డెప్యూటీ కమిషనర్ Irving, ఇతర అమృతసర్ నగర అధికారులు మాత్రం అంత మంది ప్రజలు సమావేశం అవటం నిరోధించలేదు. కనీసం శాంతియుతంగా గుంపులను చెదరగొట్టటానికి అయినా ప్రయత్నించలేదు.

ప్రజలను ఉద్దేశించి కొంతమంది నాయకులు సాయంత్రం 5.30 ఉపన్యాసాలు ఇవ్వటం ప్రారం భించారు. ఒక గంట తరువాత (6.30 pm) కు Dryer ఆ తోటలోకి వచ్చాడు. ఆయనతో పాటు ఒక 50 మంది సైనికులు, 25 మంది Gurkha Rifles దళం (1st battalion, 9th Gurkha Rifles), మరి కొంతమంది 59th Sindh Rifles దళం సభ్యులు కూడా వచ్చారు. వారందరు .303 Lee–Enfield bolt-action రైఫిల్స్ పట్టుకుని ఉన్నారు.

ఆ తోటకు 5 ఇరుకు (narrow) ప్రవేశ ద్వారాలు ఉన్నా అవి శాశ్వతంగా తాళాలు వేయబడ్డాయి. ప్రధాన ప్రవేశ ద్వా రం కొంచెం వెడల్పుగానే ఉంటుంది. ఆ ద్వారానికి అడ్డుగా తుపాకులతో ఉన్న రెండు పెద్ద మిలిటరీ వాహనాలు నిలిచి ఉన్నాయి. తోటలోనుంచి ఎవ్వరూ తప్పించుకుని బయటకు వెళ్లకుండా రాకుండా నిరోధించాలని Dyer వ్యూహం.

తోటలో ఉన్న ప్రజలకు ముందు హెచ్చరిక లేకుండా కమాండర్ Dyer వారివైపు గురిచూసి తుపా కులు కాల్చమని ఆదేశించటం జరిగింది. ఎక్కడ ఎక్కువమంది గుమిగుడారో అటువైపు కాల్చమని ఆజ్ఞ లిచ్చాడు. సైనికులు వెంటనే ప్రజలవైపు కాల్చటం ప్రారంభించారు. దీనితో భయాందోళనకు గురైన ప్రజలు పారిపోవటానికి అన్ని ద్వారాల వైపుకు పరుగెత్తారు. అన్ని ద్వారాలు మూసుకుపోవటంతో ఎవ్వ రూ బయటకు వెళ్ళలేకపోయారు. కాల్పులు సుమారు 10 నిమిషాలు అవిరామంగా జరిగాయి. ఫలితం గా నిరాయుధులైన పౌరులు (పురుషులు, మహిళలు, వృద్ధులు, పిల్లలు)

అనేకమంది మరణించటం జరిగింది. ఈ అమృతసర్ నరమేధం, ***జల్లియన్ వాలా నరమేధంగా*** భారత చరిత్రలో నిలిచిపోయింది.

కాల్పుల విరమణ కేవలం మందుగుండు సామగ్రి సరఫరా అయిపోయినందువల్లనే! ఇది జరి గిన తరువాత దీనిని గురించి ఈ నర హంతకుడు 'Colonel Reginald Edward Harry Dyer' వ్యాఖ్య ఈ విధంగా ఉంది: "***ఈ చర్య ప్రజల సమావేశాన్ని చెదరగొట్టడం కోసం కాదు; ఆంగ్లప్రభుత్వానికి అవిధే యతతో ఉన్న భారతీయులను శిక్షించడానికి మాత్రమే***!

**ఈ నరమేధం వల్ల ఎంతమంది బలిఅయ్యారు?**

ఎంతమంది భారతీయుల ప్రాణాలను ఈ ఆంగ్లేయ నరహంతకుడు బలి తీసుకున్నాడో సరిగ్గా ఇప్పటికీ తెలియదు. లెక్కలు వేర్వేరుగా ఉన్నాయి. వాటిని పరిశీలిద్దాము.

1. మరుసటి రోజు తన నివేదికలో Dyer ఇలా తెలియజేశాడు: “ఆ గుంపులో మరణించిన వారి సంఖ్య 200-300 మధ్య ఉందని నేను విన్నాను. నా సైనికులు 1650 rounds కాల్పులు జరిపారు. కాల్పుల వల్ల నేరుగా మరణించిన వారే గాక, తొక్కిసలాటలో కొంతమంది ప్రాణాలు పోయాయి. ఇంకా కొంతమంది కాల్పులు తప్పించుకోటానికి అక్కడ ఉన్న నూతిలో దూకి ప్రాణాలు పోగొట్టుకున్నారు."

2a. దేశ స్వాతంత్రం వచ్చిన తరువాత అచ్చట ఏర్పాటు చేసిన ఫలకం మీద “బావిలో నుంచి 120 మృత దేహాలు బయటకు తీయబడ్డాయి” అని వ్రాసి ఉంది.

2b. ఆ రాత్రికి, మరుసటి రోజుకు కూడా Dyer కర్ఫ్యూ పొడిగించినందువల్ల క్షతగాత్రులకు వైద్య సహా యం అందించటానికి వీలుకానందువల్ల కొంతమంది రాత్రి సమయంలో మరణించారు.

3. నర మేధం తరువాత ఆంగ్ల ప్రభుత్వం విడుదల చేసిన అంచనా ప్రకారం “379 మంది ప్రజలు చంప బడ్డారు; సుమారు 1,200 మంది పైచిలుకు గాయపడ్డారు; కాల్పుల విరమణ తర్వాత సైనికులు వెంటనే అక్కడినుంచి వెళ్లిపోయారు; క్షతగాత్రులకు రక్తస్రావం జరిగినందువల్ల మరణాల సంఖ్య పెరిగింది.”

4. అమృతసర్ లోని సేవా సమితి విచారణ చేపట్టి “379 మరణాలు; 192 మంది తీవ్రంగా గాయపడిన ట్లు” తెలిపింది.

5. ఆంగ్ల ప్రభుత్వం ఏర్పాటు చేసిన Hunter Commission “379 మంది మరణించినట్లు, దానికి మూడు రెట్లు మంది గాయపడినట్లు; మరణించిన వారిలో 41 మంది బాలురు, 6 వారాల ఒక పసి పాప” అని నివేదించింది.

4. అప్పటి Secretary of State for War విన్స్టన్ చర్చిల్ (Winston Churchill) దాదాపు 400 మంది వధించబడ్డారు అని బ్రిటిష్ పార్లమెంట్ కు తెలియాజేశాడు.

5. భారతీయ జాతీయ కాంగ్రెస్ ఏర్పాటు చేసిన ఒక విచారణ కమిటీ “1,000 పైచిలుకు మరణించినట్లు, 500 మంది గాయపడ్డారు” అని తెలిపింది.



జలియాన్ వాలా తోటలోని అమరవీరుల బావి. ఇందులో పడి 120 మంది అమృతసర్ వాసులు మరణించారు.



ఆంగ్ల సైనికుల ఆజ్ఞ మేరకు చేతులతో, కాళ్లతో పొట్ట మీద పాకిన ఒక అమృతసర్ వాసి



నరమేధం జరిగిన కొన్ని నెలల తరువాత జలియన్ వాలా బాగ్ దృశ్యం

***సశేషం***

COMMENTS